క్లుప్తంగా

ఎమ్మెల్యే చొరవతో రోడ్లకు మహర్దశ



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత రహదారుల అభ్యున్నతికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్ అన్నారు. మంగళవారం కుల్కచర్లలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బీటీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో రహదారులు బాగునప్పుడే మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్, నరహరి, బాబు, బాలకృష్ణ, భీమయ్య, వెంకట్, భాను, రమేష్, మురళీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణం కోసం మంగళవారం భూమి పూజ చేశారు. త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్‌నాయక్, కరుణాకర్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లేశం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విగిరిపడిన చెట్టు



అల్లిపూర్ బస్టాప్ సమీపంలో రోడ్డుపై పడిన చెట్టు

ధారూరు: వికారాబాద్–తాండూరు మార్గంలో మండల పరిధి అల్లిపూర్ బస్టాప్ సమీపంలో ప్రధాన రోడ్డుపై మంగళవారం ఓ చెట్టు విరిగి పడింది. దీంతో వికారాబాద్ వైపు నుంచి తాండూరు వెళ్లే వాహనదారులకు అంతరాయం కలిగింది. డబుల్ రోడ్డు కావడంతో వాహనదారులు కంగారుపడ్డారు. కొన్ని వాహనాలు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. ఈ విషయం తెలిసిన ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య అక్కడికి చేరుకుని రోడ్డుపై పడిన చెట్టును తొలగించి రాకపోకలు సాఫీగా జరిగేలా చేశారు.

శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తాం



బోరు మోటార్ ఆన్ చేస్తున్న నాయకులు

మర్పల్లి: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పన కోసం తన వంతు కృషి చేస్తానని మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడెం మల్లేశ్‌యాదవ్ చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో బోరు మోటారును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాములుయాదవ్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశాన వాటికల్లో పేరుకుపోయిన ముళ్ల పొదలను తొలిగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఫసియొద్దీన్, మిషన్ భగీరథ ఏఈ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, కాంట్రాక్టర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం అశోక్

మర్పల్లి: పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని మండలంలోని ఘణాపూర్ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం అశోక్ సూచించారు. మంగళవారం విద్యార్థుల కోసం వేదాంత పబ్లికేషన్, సరస్వతి బుక్‌స్టాల్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. విద్యార్థులు ఓ ప్రణాళికబద్ధంగా చదువుకొని 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు.

ప్రణాళికతో ప్రగతి

- లాభాల బాటలో నావంద్గీ సొసైటీ
- రూ.1.20 కోట్ల వార్షిక ఆదాయం
- వాణిజ్యపరమైన సేవలతో ఆర్థిక తోడ్పాటు



నావంద్గీ సొసైటీ కార్యాలయం

బషీరాబాద్: పాలకవర్గం ప్రణాళికబద్ధంగా చేస్తున్న వ్యవసాయ సేవలతో పాటు వాణిజ్యపరమైన నిర్ణయాలతో మండల కేంద్రంలోని నావంద్గీ సొసైటీ పటిష్ట స్థితికి చేరుకుంది. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గాను కమర్షియల్ బిజినెస్‌తో రూ.1.20 కోట్లు ఆర్జించింది. ఈ నిధులతో సొసైటీకి ఆర్థిక వనరులు చేకూర్చే నిర్మాణాలను చేపట్టి ఆదర్శంగా నిలుస్తుంది. ఇందులో 4,400 మంది రైతుల సభ్యత్వంతో రూ.కోటి షేరింగ్ నిధులతో పాటు రూ.3.50 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సొంతం చేసుకుంది. అన్నదాతలకు సకాలంలో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చి అండగా ఉంటుంది. అలాగే వ్యవసాయ సేవల్లో భాగంగా రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. పండించిన ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులకు సహకారం అందిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది. వ్యవసాయ ఆధారిత సేవలతో పాటు వాణిజ్యపరమైన వ్యాపారాలపై కూడా దృష్టి పెట్టింది. బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు, ఇంటి, వాహనాలపై రుణాలు ఇస్తుంది. దీంతో ఏడాదిలో రూ.1.20కోట్ల లాభాలను ఆర్జించి పటిష్టమైన ఆర్థిక సొసైటీగా నిలిచింది.

పెట్రోల్ బంక్, రైస్‌మిల్ నిర్మాణాలు

సొసైటీ సొంత నిధులతో పాటు రూ.2 కోట్ల నాబార్డు రుణాలు తీసుకొని పెట్రోల్ బంక్, రైస్‌మిల్ నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే రైస్‌మిల్ పూర్తికాగా, పెట్రోల్ బంక్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అలాగే 1500 మెట్రిక్ టన్నులు, వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే రెండు భారీ గోదాంల నిర్మాణ పనులు సైతం శరవేగంగా జరుగుతున్నాయి. వాణిజ్యపరమైన పెట్రోల్ బంక్, రైస్‌మిల్ సేవలు అందుబాటులోకి వస్తే వార్షిక ఆదాయం నాలుగు రెట్లు పెరుగుతుందని పాలకవర్గం అంచనా వేస్తుంది. అలాగే ధాన్యం నిల్వల సామర్థ్యం 2500 మెట్రిక్ టన్నులకు చేరనుంది.

సమష్టి కృషితో లాభాలు

రైతులు, పాలకవర్గం సభ్యుల సహకారంతో పాటు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తోడ్పాటుతో సొసైటీని లాభాల బాట పట్టించామని సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. రైతులకు వ్యవసాయ ఆధారిత సేవలందిస్తూనే వాణిజ్యంపై దృష్టి పెట్టామన్నారు. సొసైటీకి సొంతంగా ఆర్థిక వనరులు అందించే పెట్రోల్ బంక్, రైస్‌మిల్ వంటి నిర్మాణాలు చేపట్టామన్నారు. త్వరలోనే వాటి సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్

విద్యార్థుల చదువులో నిర్లక్ష్యం తగదు

ఎంఈఓ వెంకట్

దోమ: విద్యార్థులకు అందిస్తున్న చదువులో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించరాదని ఎంఈఓ వెంకట్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో తరగతుల వారీగా ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎస్ఏ1, ఎస్ఏ3 కంప్యూటరీకరించాలని చెప్పారు. పాఠశాలలో టాయిలెట్స్, కంపౌండ్ వాల్, కిచెన్‌షెడ్ లేని వాటిని గుర్తించి వాటి నివేదికలు ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తూ వాటి బిల్లులను ఎప్పటికప్పుడు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదిలో మంచి ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సీఆర్పీలు రెడ్యా, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చందన గణేశుడు



ప్రత్యక్షమైన వినాయకుడి విగ్రహం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గేటు వద్ద ఉన్న పల్లెగూడ ఆంజనేయస్వామి ఆలయంలో వినాయకుడి విగ్రహం మంగళవారం ప్రత్యక్షమైంది. స్థానికుల కథనం ప్రకారం... ఆంజనేయస్వామి ఆలయంలో 40 ఏళ్ల నుంచి స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు. నిత్యం చందనం పూసి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ క్రమంలో మిగిలిన చందనాన్ని గర్భగుడిలో ఓ మూలన ఉన్న రాయికి పూసేవారు. రెండు రోజుల క్రితం రాతికి చందనం పూస్తుండగా పెచ్చులూడాయి. అందులో నుంచి వినాయకుడి ఆకృతి బయటకు వచ్చింది. దీంతో భక్తులు అక్కడికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 24న మల్లికార్జున ముత్యాస్వామితో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో లింగప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. ఇంతలోనే వినాయకుడి విగ్రహం బయటకు రావడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివస్వాములు



కుల్కచర్ల: ఇరుముడి పూజలో శివస్వాములు



దోమ: ఇరుముళ్లు కట్టుకొని పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు

దోమ: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి శివస్వాములు మంగళవారం పాదయాత్రగా బయల్దేరారు. మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన పలువురు శివస్వాములు స్థానిక శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకొని శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా పయనమయ్యారు. శివస్వాములను సాగనంపేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఇప్పాయిపల్లిలో..

కుల్కచర్ల: మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన శివస్వాములు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. మంగళవారం స్థానిక శివాలయంలో శివస్వాములు ఇరుముడులు కట్టుకొని పాదయాత్రగా బయలుదేరారు. స్థానికులు పెద్దఎత్తునకార్యక్రమానికి తరలివచ్చారు.

వందకోట్లతో అండర్‌పాస్‌ల నిర్మాణం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.100 కోట్లతో షాద్‌నగర్ పరిధిలోని బైపాస్ జాతీయ రహదారిలో మూడుచోట్ల అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ పరిధిలో కొత్తూరు, పెంజర్ల, జేపీ దర్గా, మేకగూడ, చటాన్‌పల్లి, బూర్గుల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు అండర్‌పాస్‌లు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి నేషనల్ హైవే అథారిటీ పీడీని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన ప్రభుత్వాలు జేపీ దర్గా, చటాన్‌పల్లి వద్ద, బూర్గుల గేటు వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణాలకు రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో అండర్‌పాస్ నిర్మాణం సుమారు కిలోమీటర్ మేర నిర్మించనున్నట్లు, ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. ఈ నిర్మాణ పనులు మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభిస్తామని వెల్లడించారు. అండర్ పాస్‌ల నిర్మాణం పూర్తయితే ప్రయాణం సులభంగా మారుతుందని, ప్రమాదాలు జరిగే అవకాశమే ఉండదన్నారు. అదేవిధంగా రెండో విడతలో కొత్తూరు నుంచి కర్నూల్ వరకు ఉన్న బెంగుళూరు జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. చటాన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని వై ఆకారంలో నిర్మిస్తామని, బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా నిధులు మంజూరు చేయాలని సీఎం కోరినట్లు తెలిపారు. త్వరలో నిధులు మంజూరు కానున్నాయని, పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కొంకళ్ల చెన్నయ్య, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో బుధవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు శివాజీ యువజన సంఘం సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని ఏఈ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మాధారం, పేటమాధారం, రంగాపూర్, బసిరెడ్డిపల్లి, నజీరాబాద్, న్యామత్‌నగర్‌లతో పాటు సన్‌సిటీ, జయంతినగర్, కెఆర్ఆర్ కాలనీ, ఎన్ఆర్ఐ కాలనీ, మధురనగర్ కాలనీ, లక్ష్మీనగర్, ఆర్టీసీ కాలనీ, వెంకటేశ్వరకాలనీలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు



శ్రీకాంత్‌కు ఎల్ఓసీ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్ సూచన మేరకు కొత్లాపూర్ గ్రామానికి శ్రీకాంత్‌కు రూ.80 వేల ఎల్ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా స్పీకర్ ఆదుకుంటారని తెలిపారు. శ్రీకాంత్ కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పారు. విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్ఎఫ్ కింద ఆదుకున్నారన్నారు.

ఇద్దరికి డీఎస్సీ పోస్టింగ్‌లు

మర్పల్లి: ఇటీవల డీఎస్సీ 2008 పోస్టింగ్‌లలో మండలానికి చెందిన ఇద్దరికి పోస్టింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని గుండ్లమర్పల్లి పీఎస్ పాఠశాలలో మహబూబ్‌అలీ, కొంషెట్‌పల్లి ఉర్దూ మీడియం పాఠశాలలో నూరొద్దీన్ మంగళవారం విధుల్లో చేరినట్లు వారు తెలిపారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులకు స్వాగతం తెలిపారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కందుకూరు: ఆమనగల్లులో నిర్వహిస్తున్న రైతు దీక్ష కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీఎత్తున స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించి జేసీబీ యంత్రాలతో గులాబీ పూలను చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కందుకూరు చౌరస్తాతో పాటు దెబ్బడగూడ గేట్ వద్ద పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కంచారు. అనంతరం ఆయన వెంట రైతుదీక్షకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.లక్ష్మినర్సింహారెడ్డి, గణేశ్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అధ్యక్షతన షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దశల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌సాగర్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు షాబాద్ దర్శన్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎలిగేపల్లి శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు పట్లోళ్ల జనార్ధన్‌రెడ్డి, మంజుల రవియాదవ్, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్తమైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతి ప్రార్థనశాల, ధ్యానాధివాసం, అభిషేకాలు, విగ్రహ పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్, మోత్కుపల్లి రాములు, అమ్డాపూర్ గ్రామ నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలి



పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్(పాలిథిన్) ఉత్పత్తుల నిషేధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య కోరారు. ఇందులో భాగంగా మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు వ్యాపారులు, ప్రజలు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇళ్లు, ఖాళీ ప్రాంతాల్లో చెత్తను పారబోయకుండా ప్రజలు శుభ్రతను పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం చిన్న చిన్న ఫంక్షన్ల(శుభకార్యాలు)తో పాటు పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం చాలావరకు పెరిగిందన్నారు. నాణ్యతలేని ప్లాస్టిక్ ఉత్పత్తుల కారణంగా పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యాలకు చాలావరకు ముప్పు ఉందన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. దీనికితోడు తడి, పొడిచెత్తను వేరుచేసి సిబ్బందికి అందించాలని ప్రజలు, వ్యాపారులను కోరారు. నాణ్యతలేని ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించే వ్యాపారులకు జరిమానాలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్ సోమ్లానాయక్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావొస్తున్నా ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఇంతవరకు దరఖాస్తుల ప్రక్రియ కూడా పూర్తికాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేదంటే పేదల పక్షాన సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు బాలరాజ్, రత్నయ్య, బాలమ్మ పాల్గొన్నారు.

ఉన్నత భవిష్యత్‌కు మార్గాలు చూపించాలి

- పెద్దపల్లి మాజీ ఎంపీ బి.వెంకటేశ్ నేత



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

చేవెళ్ల: విద్యార్థుల భవిష్యత్‌కు ఉన్నతమైన మార్గాలను వేసే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదేనని పెద్దపల్లి మాజీ ఎంపీ బి.వెంకటేశ్ నేత అన్నారు. మండలంలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాల రెండో వార్షికోత్సవాన్ని పాఠశాల చైర్మన్ కె.నరేశ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పెద్దపల్లి మాజీ ఎంపీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాలలో వివిధ విభాగాల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ కె. లావణ్య, డైరెక్టర్ హనుమంత్‌రావు, డీన్ మౌనిక, ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన, వైస్ ప్రిన్సిపాల్ బి.వేణుకుమార్, మేనేజర్ ఆర్. నరేశ్, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, మండల విద్యాధికారి పురన్‌దాస్, సీఐ భూపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి పూజలో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో గత మూడురోజుల పాటు జరిగిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. చివరిరోజు ఆలయం వద్ద ఆలయ ధర్మకర్తలు సున్నపు వసంతం, మానిక్యప్రభు, అర్చకుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో పునఃపూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్ర హోమం, పూర్ణాహుతి, భజన కార్యక్రమాలు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి సహకారంతో చేపట్టిన గోశాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.